## క్లుప్తంగా

### లోఓల్టేజీతో అవస్థలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ సుమన్, గ్రామస్తులు

కంచిలి: పెద్దశ్రీరాంపురం పంచాయతీ పరిధిలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యను ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. బల్లెడవీధిలోని ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచి లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. లోఓల్టేజీ కారణంగా టీవీలు, ఫ్యాన్లు, మోటార్లు పనిచేయడం లేదని వాపోయారు. బల్లెడవీధిలో మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్ బల్లెడ సుమన్‌తో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

### రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సోంపేట: మాజీ ప్రధానమంత్రి, దివంగత రాజీవ్‌గాంధీ భారతదేశ అభివృద్ధికి బాటలు వేశారని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం సోంపేట పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కంప్యూటర్లు, టెలికమ్యూనికేషన్ రంగంలో రాజీవ్ గాంధీ కొత్త సంస్కరణలు ప్రవేశ పెట్టి యువతకు మార్గదర్శకమయ్యారని గుర్తు చేశారు.

### మామిడిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పలాస: మామిడిపల్లి గ్రామంలో రెంటికోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని( ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం) బుధవారం నిర్వహించారు. 51 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. మెరుగైన ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్, హెల్త్ అసిస్టెంటు కామేశ్వరరావు, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు జ్యోతి, హేమలత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

### శరీరసౌష్టవ పోటీల్లో యువకుడు ప్రతిభ



బ్రహ్మకు పతకాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

మందస: శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో మంగళవారం రాత్రి జరిగిన రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో హరిపురం గ్రామానికి చెందిన వమ్మరవెల్లి బ్రహ్మ ప్రతిభ కనబర్చారు. 80 కిలోల కేటగిరీలో 5వ స్థానంలో నిలిచి బ్రాంజ్ పతకాన్ని గెలుచుకున్నారు. బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు విజయ్ ప్రసాద్, గౌరీ శంకర్, పలువురు కోచ్‌లు బ్రహ్మను అభినందించారు.

### సంకల్పంతో అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: ప్రజలకు రోడ్డు భద్రత, శక్తి యాప్, సైబర్ మోసాలపై అవగాహన కల్పించేందుకు సంకల్పం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. ముచ్చింద్ర గ్రామంలో బుధవారం 'సంకల్పం'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదార్థాలను సేవించి వాహనాలను డ్రైవింగ్ చేయరాదని, రోడ్డుపై ప్రయాణించే సమయంలో తప్పని సరిగా నియమ, నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించారు. శక్తి యాప్‌ను స్మార్ట్ మొబైల్స్ ఉన్న వారితో డౌన్లోడ్ చేయించి ఆవశ్యకతను వివరించారు.

# ఇకపై పడిగాపులే..



టెక్కలిలో వాహనం వద్ద సరుకులు అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

- రేషన్ బండి సేవలకు మంగళం
- ఇంటింటా రేషన్ పంపిణీకు స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో లబ్ధిదారులు

టెక్కలి: పేద, సామాన్య వర్గాలకు చెందిన లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం మరో పెద్ద షాక్ ఇచ్చింది. నిన్నటి వరకు ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందజేసే ఎండీయూ (రేషన్ బండి) వాహనం సేవలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేద, సామాన్య వర్గాలకు చెందిన లబ్ధిదారులు రేషన్ అందుకోవాలంటే రోజుల తరబడి రేషన్ దుకాణాల్లో డీలర్ల చుట్టూ పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఉండేవి. ఒక్కో నెల రేషన్ కూడా అందేవి కాదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ పంపిణీ విధానంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారు. ఏ ఒక్క లబ్ధిదారుడు రేషన్‌కు దూరం కాకుండా ఉండే విధంగా ప్రత్యేకంగా ఎండీయూ పేరుతో రేషన్ బండ్లతో ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేసే విధంగా సరికొత్త విధానానికి నాంది పలికారు. దీని ద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి సైతం కలిగింది. అంతే కాకుండా కరోనా వంటి విపత్కరమైన పరిస్థితుల్లో ఈ రేషన్ వాహనాలు ఎంతో ఉపయోగపడ్డాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంభవించిన తుఫాన్, వరదల సమయాల్లో ఈ వాహనాలతోనే ప్రజలకు సాయం అందజేశారు. అటువంటి ఈ వాహనాల సేవలను నిలిపివేస్తూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు అన్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం కుట్ర పూరితమైన నిర్ణయం తీసుకోవడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

టెక్కలి నియోజకవర్గంలో ఎండీయూ సేవలు ఇలా..

| మండలం | వాహనాలు | డిపోలు | కార్డులు | యూనిట్లు |
|---|---|---|---|---|
| టెక్కలి | 15 | 50 | 21,765 | 63,662 |
| నందిగాం | 12 | 48 | 18,222 | 52,071 |
| సంతబొమ్మాళి | 14 | 47 | 22,859 | 66,247 |
| కోటబొమ్మాళి | 14 | 53 | 22,811 | 65,339 |

### రేషన్ వాహనాలు లేకపోతే ఇబ్బందే..



గతంలో రేషన్ సరుకుల కోసం పనులు మానుకుని కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ వాహనాలు ఇంటి వద్దకే వచ్చి సరుకులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ వాహనాలు లేకపోతే మాలాంటి మారుమూల గిరిజనులకు పూర్తిస్థాయిలో రేషన్ అందని పరిస్థితులు దాపురిస్తాయి. రేషన్ వాహనం ఇళ్ల వద్దకు రాకపోతే ఇబ్బందులు తప్పవు.

– జి.చంద్రరావు, జీడిపేట, టెక్కలి మండలం

### రేషన్ వాహనాలతో మెరుగైన సేవలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేద, సామాన్య వర్గాల కోసం రూపకల్పన చేసిన ఎండీయూ (రేషన్ వాహనాల) వలన మెరుగైన ప్రజా పంపిణీ సేవలు అందాయి. అలాంటి వాహనాలను తీసివేయాలనుకోవడం అన్యాయం. ఇకపై డీలర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు చోటు చేసుకుంటాయి. అంతే కాకుండా పూర్తిస్థాయిలో రేషన్ కూడా అందని దుస్థితి ఏర్పడుతుంది.

– డి.లోకేశ్వర్‌రెడ్డి, పాతనౌపడ, టెక్కలి మండలం

### ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి



దువ్వాడ రవి

పలాస: ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉన్న ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తుండడంతో ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేసేవారన్నారు. అటువంటి ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం చాలా దారుణమన్నారు. ఇక నుంచి రేషన్ డిపోల వద్ద పనులు మానుకొని గంటల కొద్దీ క్యూ కట్టాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వలంటీర్లను రద్దు చేసి వారిని వీధుల పాల్జేశారని, అలాగే ఇప్పుడు ఎండీయూ వాహన డ్రైవర్లకు పనిలేకుండా చేసి ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

### వైభవంగా గ్రామదేవత ఉత్సవం



సోంపేట మండలం కొర్లాం పంచాయతీ హుకుంపేట గ్రామంలో పెద్దమ్మ తల్లి, నీలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ బుధవారం జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల పరిషత్ నిధులతో ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పైడి పట్టాభి, తామాడ మోహనరావు, బంగారు పాపారావు, కర్రి జగదీష్, పెద్దింటి ఢిల్లీరావు, పూజారి తులసిరావు, శివంగి సోమేష్, సూరాడ పాపారావు పాల్గొన్నారు. –సోంపేట

### వడదెబ్బపై అవగాహన



వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ఆటో రిక్షా డ్రైవర్లు, జీడి కార్మికులు, ఇతర ప్రజలకు వడదెబ్బకు గురికాకుండా ఎటువంటి జాగ్రత్తలు వహించాలనే అంశంపై బుధవారం అవగాహన కల్పించారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంచిపెట్టారు. చలువ కళ్లద్దాలు పెట్టుకోవడం, ఎండ తగలకుండా టోపీ ధరించడం, మజ్జిగ, పెరుగు, తాగునీరు తగినంత తీసుకోవాలని సూచించారు. – కాశీబుగ్గ

### నవధాన్యాలతో బహుళ ప్రయోజనాలు



నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ విధానం కంచిలి మండల యాంకర్ టి.శివానందం అన్నారు. బొగాబెణి గ్రామంలో సర్పంచ్ గణప సింహాచలం అధ్యక్షతన నవధాన్యాల సాగుపై అవగాహన సదస్సు, ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఖరీఫ్ ప్రణాళిక, నవధాన్యాల సాగు గురించి వివరించారు. ఆదర్శ రైతులు రెడ్డి రేవంత్, కుణితి వెంకటరావులను సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాస్, వి.ఎ.ఎ.రాజేష్, సీసీ ధనలక్ష్మి పాల్గొన్నారు. – కంచిలి

## అభివృద్ధిని అడ్డుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వసంతరెడ్డి తదితరులు

సంతబొమ్మాళి: అభివృద్ధి కారకులమని చెప్పుకునే మంత్రి అచ్చెన్నాయుడు సంతబొమ్మాళి మండలంలో అభివృద్ధి పనులను ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలని జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కోరారు. ఇదే విషయమై ఎంపీడీవో జయంతి ప్రసాద్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ.. మండల, పంచాయతీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసంపంచాయతీ తీర్మానాలు చేసి అధికారులకు ఇచ్చామని, వాటికి ఎస్టిమేషన్ వేయకుండా మంత్రి అచ్చెన్నాయుడు అడ్డుకుంటున్నారని అధికారులు పరోక్షంగా చెబుతున్నారని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై మంత్రి సమాధానం చెప్పాలని కోరారు. ఎంపీడీవోను కలిసి వారిలో ఎం.అప్పారావు, నక్క భీమారావు, పి.రామకష్ణ, బి.మోహన్‌రెడ్డి, ఎం.నాగభూషణరావు, అంగ జనార్దన్, బి.సుధాకర్ ఉన్నారు.

# సచివాలయానికి తాళం!



తాళం వేసి ఉన్న రెండో నంబర్ సచివాలయం

మందస: మందస మండల కేంద్రంలో సచివాలయ సేవలు పడకేశాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ మూడు సచివాలయాలు ఉండగా.. ప్రస్తుతం ఒకటో నంబర్ సచివాలయంలో మాత్రమే సేవలు అందుతున్నాయి. రెండో నంబర్ సచివాలయానికి ఏకంగా తాళం వేసేశారు. మూడో నంబర్ సచివాలయం కనీసం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. దీంతో రెండు, మూడు సచివాలయాల పరిధిలోని ప్రజలు సేవలకు దూరమయ్యారు. ఈ సచివాలయాల సిబ్బంది సర్వేలో ఉన్నారని ఏకంగా కాగితంపై రాసేసి తలుపులకు అంటించేశారు. దీంతో ఈ సచివాలయ పరిధిలోని ప్రజలకు కావాల్సిన సేవల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఒకటో నంబర్ సచివాలయానికి వెళ్లి రేషన్ కార్డు, ఇతర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఒకటో నంబర్ సచివాయలంలో కూడా సర్వర్ పని చేయడం లేదని, ఒకే కంప్యూటర్ పని చేస్తోందని సిబ్బంది చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

# విద్యకు సర్దుపోటు!

- పిల్లలపై చూపనున్న ప్రభావం
- వెంటాడనున్న ఉపాధ్యాయుల కొరత



ఇచ్ఛాపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల

ఇచ్ఛాపురం టౌన్: కూటమి ప్రభుత్వ హయాంలో విద్యా విధానం ఆందోళనగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. నూతన విద్యా విధానంలో పాఠశాలల పునర్నిర్మాణం, ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం వల్ల విద్యార్థులపై బయటకు కనిపించని ప్రభావం చూపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాలలను నిర్వీర్యం చేసే ఉద్దేశంతో కూటమి సర్కార్ గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన క్లస్టర్ విధానానికి స్వస్తి చెప్పి మోడల్ స్కూల్ విధానానికి శ్రీకారం చుట్టింది. గతంలో ఎందరో విద్యావేత్తలు, అనుభవం కలిగిన వారు పరిశీలన జరిపి విద్యా విధానంలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ విద్యాబోధన చేసేందుకు సెక్షన్‌కు 40 మంది విద్యార్థులు ఉండాలని నిర్ణయించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో ఒక సెక్షన్‌లో విద్యార్థుల సంఖ్య 40 నుంచి 53కు పెంచడంతో ఉపాధ్యాయుల మిగుల సంఖ్య పెరిగింది. సెక్షన్లలో విద్యార్థుల సంఖ్య పెరగడం వల్ల బోధన చేసే ఉపాధ్యాయులపై పనిభారం పడింది. సెక్షన్‌కు 40 మంది ఉండేవిధగానే గతంలో బెంచీలు, ఫ్యాన్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు జరిగాయి. అయితే ఇప్పుడు విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పిల్లలు వసతి సౌకర్యాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని కొంతమంది ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్ఛాపురంలో ఉన్న ఎనిమిది ప్రాథమికోన్నత పాఠశాలలు, 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 225 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే సర్దుబాటు జరిగితే 45 మంది ఉపాధ్యాయులు మిగులుతున్నట్టు ఎంఈవో కె.విశ్వనాథం తెలిపారు.

**నాలుగు మోడల్ ప్రైమరీ పాఠశాలలు**

ఇచ్ఛాపురం మండలంలోని కొలిగాం, బిర్లంగి తోటూరు, మండపల్లి, లొద్దపుట్టి ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించామని ఎంఈవో విశ్వనాథం చెప్పారు. ఈ పాఠశాలలకు సమీపంలోని పాయితారి, సైదాలపుట్టుగ, మునిబద్ర, అయ్యవారిపేట పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల పిల్లలను చేర్పిస్తామన్నారు. ఒక్కో మోడల్ ప్రైమరీ పాఠశాలకు 12 మంది ఉపాధ్యాయులను నియమిస్తున్నట్టు పేర్కొన్నారు. మిగిలిన 1, 2 తరగతులకు ఒక ఉపాధ్యాయుడు బోధన చేస్తారని వివరించారు. 46 ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం 165 మంది ఉపాధ్యాయులు ఉండగా మరో 20 మంది అవసరం ఉందని ఎంఈవో పేర్కొన్నారు. అయితే మూడో తరగతి నుంచే పక్క గ్రామానికి తమ పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు. దీంతో గ్రామాల్లో ఉండే ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీని ప్రభావం ప్రభుత్వ పాఠశాలలపై పడే అవకాశం ఉంది.

### ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కంచిలి: మకరాంపురం గ్రామంలో నిర్వహిస్తున్న అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం చంద్రుపుట్టుగ–నర్తుపుట్టు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన నర్తుపుట్టుగ జట్టు నిర్ణీత పది ఓవర్లలో 70 పరుగులు చేసి పది వికెట్లు కోల్పోయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన చంద్రుపుట్టుగ జట్టు పది ఓవర్లలో 55 పరుగులు మాత్రమే చేసి 8 వికెట్లు కోల్పోయింది. విన్నర్‌గా నర్తు పుట్టుగ జట్టు నిలిచింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికైన రోహిత్ రెండు ఓవర్లు బౌలింగ్‌చేసి, ఏడు పరుగులిచ్చి, మూడు వికెట్లు తీసుకొన్నాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను మకరాంపురం గ్రామానికి చెందిన రిజర్వుడ్ ఎస్సై భావన సందీప్ చేతులమీదుగా అందజేశారు.

### ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేతలతో నిర్వాహకులు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ క్రీడా మైదానంలో ఈనెల 11వ తేదీన నుంచి జరుగుతున్న రైల్వే క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. స్థానిక కౌన్సిలర్ గుజ్జు జోగారావు ఆధ్వర్యంలో జరిగిన టోర్నమెంట్‌లో 32 జట్లు తలపడ్డాయి. విశాఖపట్నానికి చెందిన మూర్తి లెవెన్సు జట్టు విజేతగా నిలవగా స్థానిక రైల్వేగ్రౌండ్ జట్టు రన్నర్‌గా నిలిచింది.

### దుకాణాల్లో పోలీసుల తనిఖీలు



బస్టాండ్‌లోని ఓ దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కవిటి: మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాల నివారణపై పోలీసులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా కవిటి పట్టణంలోని అన్ని ప్రధాన సెంటర్లలోని వర్తక, వాణిజ్య కేంద్రాలు, పండ్ల దుకాణాలు, టీస్టాల్, కిరాణా దుకాణాలకు వెళ్లి నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌ల సహాయంతో బుధవారం పోలీసులు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం చట్టరీత్యానేరమని ప్రజలకు అవగాహన కల్పించారు.

# జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



కవిటి: జానకీరావును పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ విజయ



టెక్కలి: అప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న దువ్వాడ వాణి

కవిటి: రాజపురం పంచాయతీ సర్పంచ్ సనపల జానకీరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం జానకీరావును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో పలు కుటుంబాలను జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి పరామర్శించారు. టెక్కలి మండలం శ్యామసుందరాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు అప్పలనాయుడు తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాన్ని, కోటబొమ్మాళి మండలం రేగులపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుంగ సిమ్మన్న మాస్టార్ భార్య మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. బొప్పాపురం సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి ఉన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్ష చేయించుకుంటున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. కొల్లూరు పంచాయతీ పరిధి కర్తలి గ్రామంలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్లు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఎంపీపీ దేవదాస్‌రెడ్డి కంటి పరీక్షను చేయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పైల లక్ష్మీనారాయణ, పైల గణేష్, టీడీపీ నేతలు వాసాల రమేష్, పైల సూర్యనారాయణ పాల్గొన్నారు.

### బస్టాండ్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



బస్టాండ్ శుభ్రత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని రాజీవ్‌గాంధీ బస్‌స్టేషన్‌ను మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు బుధవారం పరిశీలించారు. బస్‌స్టేషన్లో మౌలిక సదుపాయాల్లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈనెల 19వ తేదీన 'పేరుకే బస్టాండ్'శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి కమిషనర్ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో బుధవారం బస్టాండ్‌లో చెత్తను తొలగించి నీటితో శుభ్రపరిచారు. అత్యవసరంగా ఏమిటి అవసరమో వివరాలు రాసుకున్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ పాలకవర్గంతో చర్చించి బస్టాండ్‌ను అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు.